
టైరు చక్రంతో రన్నింగ్


హుషారుగా ఆడుతున్న చిన్నారులు

- నేటితో ముగియనున్న వేసవి సెలవులు
- రేపటి నుంచి బడి బాట పట్టనున్న విద్యార్థులు

ఆఖిరాట..!

కొనకనమిట్ల: వేసవి సెలవులు బుధవారంతో ముగియనున్నాయి. పుస్తకాలతో కుస్తీలు పట్టిన పిల్లలకు వేసవి సెలవులు ఆటవిడుపుగా మారాయి. ఇక ఒక్క రోజే సెలవు ఉండటంతో మరింత హుషారుగా ఆటల్లో నిమగ్నమయ్యారు. నగరాలు, పట్టణాల్లో వేసవి శిక్షణ శిబిరాలు, టైంపాస్ చేసేందుకు ఇతర మార్గాలు అధికంగా ఉంటాయి. అయితే పల్లెల్లో మాత్రం చిన్నారులు కర్రాబిళ్ల, అచ్చనగాయ, కబడ్డీ, కోతి కొమ్మచ్చి, జంపింగ్, తొక్కుడుబిళ్ల, గాలిపటాలు, గోళీలాట, బొంగరాల ఆటతోపాటు సినిమా హీరోల గ్రీటింగ్ కార్డులతో సందడి చేస్తారు. ట్రే పెట్టెలో ఒకరు కూచుంటే కొందరు రైరైమని లాగడం, బుల్లి సైకిల్ మీద ముగ్గురు, నలుగురు ఎక్కి ఉత్సాహంగా తిరగడం, చింత చిగురు సేకరించడంతో పాటు కొమ్మలపై సరదాగా ఊయల ఊగుతూ సందడి చేస్తున్నారు. కొనకనమిట్ల మండలంలోని పలు గ్రామాల్లో ఈ దృశ్యాలు కనిపించాయి.


వీళ్ల స్టైలే వేరబ్బా..


ఊయలలో ఐస్ తింటూ సందడి

13న మోగనున్న బడిగంట

కొమరోలు: బడిగంటలు గురువారం నుంచి మోగనున్నాయి. వేసవి సెలవుల అనంతరం ఈనెల 12న పాఠశాలలు పునఃప్రారంభం కావాల్సి ఉండగా అమరావతిలో ముఖ్యమంత్రిగా చంద్రబాబునాయుడు ప్రమాణ స్వీకారం చేస్తున్న సందర్భంగా ఒకరోజు బదులు తెరచుకోవడం ఆలస్యమైంది. ప్రత్యేక జీవో ద్వారా ఈ విషయాన్ని అధికారులు తెలియపరిచారు. వేసవి సెలవుల అనంతరం విద్యార్థుల ప్రవేశాల సంఖ్య గణనీయంగా పెరిగే అవకాశం ఉంది. ఇప్పటికే పాఠశాలలకు పాఠ్య పుస్తకాలు, నోట్ పుస్తకాలతోపాటు యూనిఫాంలు, ట్యాబ్‌లు, ఇతర విద్యాసామగ్రి, కొమరోలు మండల విద్యావనరుల కేంద్రానికి చేరాయి. మండలంలో 4220 మంది విద్యార్థులకు కిట్లు చేరినట్లుగా మండల విద్యాశాఖాధికారులు వెల్లడించారు.


కొమరోలు ఎంఆర్‌సీకి చేరిన పాఠ్య పుస్తకాలు

రసాయనిక ఎరువులతో అనర్థం


మట్టి నమూనా పరీక్షలపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

మార్కాపురం రూరల్: రైతులు అధిక దిగుబడి కోసం పొలాల్లో ఎక్కువగా రసాయనిక ఎరువులు, పురుగుమందులు వాడుతున్నారని, వాటి వినియోగాన్ని తగ్గించాలని వ్యవసాయాధికారి దేవిరెడ్డి శ్రీనివాసులు, ఉద్యానవన అధికారి రమేష్ సూచించారు. మంగళవారం మార్కాపురం మండలంలోని వేములకోట గ్రామంలో ఉద్యానశాఖ పర్యవేక్షణలో డిజిటల్ గ్రీన్ ఆధ్వర్యంలో నీరు, మట్టి పరీక్షల గురించి రైతులకు అవగాహన కల్పించారు. జిల్లా కోఆర్డినేటర్ కమలాకర్ మాట్లాడుతూ.. మట్టిపరీక్షలు చేయించడం వల్ల లోపాలు తెలుస్తాయని, దాని ప్రకారం స్థూల, సూక్ష్మ పోషకాల లభ్యతను బట్టి ఎరువులు వాడాలన్నారు. తగు మోతాదులోనే ఎరువులు, పురుగు మందుల వాడకం వల్ల నాణ్యమైన దిగుబడులు వస్తాయని, పెట్టుబడుల వ్యయం తగ్గుతుందన్నారు. కార్యక్రమంలో రైతులతోపాటు వీఏఓలు, వీహెచ్ఏలు, ఎంపీఈఓలు పాల్గొన్నారు.

సబ్‌స్టేషన్‌లో రూ.7 లక్షలతో వీసీబీ ఏర్పాటు

అర్ధవీడు (బేస్తవారిపేట): మండలంలోని మొహిద్దీన్‌పురం విద్యుత్ సబ్‌స్టేషన్‌లో నూతన వీసీబీని మంగళవారం విద్యుత్‌శాఖ అధికారులు ప్రారంభించారు. పాత వాక్యూమ్ సర్క్యూట్ బ్రేకర్ (వీసీబీ) ఏర్పాటు చేసి 20 సంవత్సరాలు దాటింది. రూ.7 లక్షలతో కొత్తది ఏర్పాటు చేసినట్లు విద్యుత్‌శాఖ ఏఈ నారాయణరెడ్డి తెలిపారు. కార్యక్రమంలో ఒంగోలు, అర్ధవీడు విద్యుత్‌శాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.


నూతన వీసీబీని ప్రారంభిస్తున్న విద్యుత్‌శాఖ అధికారులు


తీవ్రంగా గాయపడిన పరశురామ్

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్రగాయాలు

మార్కాపురం: మార్కాపురం చెరువుకట్టపై కారు బైకు ఢీకొని వ్యక్తికి గాయాలైన సంఘటన మంగళవారం సాయంత్రం చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. పొన్నలూరు మండలం పెద్ద వెంకటపాలేనికి చెందిన కె.పరుశురామ్ మార్కాపురం నుంచి టూవీలర్‌పై వెళ్తుండగా చెరువుకట్టపై కారు ఢీకొనడంతో తీవ్రగాయాలయ్యాయి. క్షతగాత్రుడిని చికిత్స నిమిత్తం మార్కాపురం జీజీహెచ్‌కు తరలించారు.

మార్కాపురం జిల్లా ఏర్పాటు చేయాలి

మార్కాపురం: పశ్చిమ ప్రకాశం ప్రజల చిరకాల కోరికైన మార్కాపురం జిల్లా ఏర్పాటుపై ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేస్తున్న చంద్రబాబునాయుడు మొదటి సంతకం చేయాలని మార్కాపురం నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ నేత సయ్యద్ జావీద్ అన్వర్ మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా పశ్చిమ ప్రకాశం ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు మార్కాపురం జిల్లాగా ఏర్పాటు చేస్తూ మొదటి సంతకం చేయాలన్నారు. జిల్లా ఏర్పాటుతో విద్యా, ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయని, వెనుకబడిన ప్రాంతంగా ఉన్న మార్కాపురం అభివృద్ధి చెందుతుందని పేర్కొన్నారు.

నిరుద్యోగులకు ప్రత్యేక శిక్షణ తరగతులు

కంభం: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన స్కిల్‌హబ్ సెంటర్‌లో పదో తరగతి, ఇంటర్, ఐటీఐ, డిగ్రీ, పీజీ విద్యార్హత కలిగిన విద్యార్థులకు వివిధ కోర్సులపై శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు నియోజకవర్గ కో ఆర్డినేటర్ టి.ఎ.నాథన్ బాబు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. డొమస్టిక్ డేటా ఎంట్రీ ఆపరేటర్, టెలికం కస్టమర్ ఎగ్జిక్యూటివ్, హెల్పర్ టెక్నీషియన్ కోర్సులు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. స్కిల్ హబ్ సెంటర్ ద్వారా శిక్షణ ఇచ్చి ఉపాధి కల్పిస్తారన్నారు. యువతీ యువకులు మూడు నెలల పాటు శిక్షణ పొంది స్థానికంగా ఉన్నటువంటి పరిశ్రమలలో లేదా ఇతర రాష్ట్రాలలో ఉద్యోగాలు పొందవచ్చన్నారు. నిరుద్యోగులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పూర్తి వివరాలకు 7997151082, 8019311043 నంబర్లను సంప్రదించాలని కోరారు.

ఎంసెట్‌లో కొమరోలు విద్యార్థికి 787వ ర్యాంకు


షేక్ మహమ్మద్ జానీ

కొమరోలు: కొమరోలుకు చెందిన ఓ విద్యార్థి మంగళవారం విడుదలైన ఎంసెట్ ప్రవేశ పరీక్షలో 787వ ర్యాంకు సాధించాడు. కొమరోలుకు చెందిన ఆర్ఎంపీ వైద్యుడు షేక్ దివాన్‌బాషా చిన్న కుమారుడు షేక్ మహమ్మద్‌జానీ అగ్రికల్చర్, ఫార్మసీ, మెడికల్ విభాగంలో రాష్ట్రస్థాయి 787వ ర్యాంకు సాధించాడు. వారం క్రితం విడుదలైన నీట్ పరీక్షలో మహమ్మద్ జానీ 629/720 మార్కులతో జాతీయ స్థాయిలో 6434వ ర్యాంకు సాధించిన విషయం తెలిసిందే. విద్యార్థిని పలువురు అభినందించారు.

ఏపీఈఏపీసెట్‌లో మార్కాపురం విద్యార్థికి 404వ ర్యాంకు


మోహన్‌పూర్ణ

మార్కాపురం టౌన్: మంగళవారం ప్రభుత్వం ప్రకటించిన ఏపిఈఏపిసెట్ ఫలితాల్లో మార్కాపురం పట్టణంలోని జ్ఞానశ్రీ నీట్ అకాడమీలో శిక్షణ పొందిన విద్యార్థి జి.మోహన్‌పూర్ణ 404 ర్యాంకు సాధించినట్లు అకాడమీ డైరెక్టర్ ఎం.మల్లికార్జున్ తెలిపారు. ఈ సందర్భంగా పూర్ణను తల్లిదండ్రులతో పాటు అధ్యాపకులు అభినందించారు.